ఆరోపణలు వద్దు.. సలహాలు ఇవ్వండి

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

సమావేశంలో మట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

మక్తల్, జూలై 7: సోషల్ మీడియలో తనపై ఆరోపణలు చేయకుండా అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఆరు నెలల్లోనే ఎన్నో సమస్యలను పరిష్కరించానని, మంచి నాయకుడిగా పేరున్న తన గురించి అధిష్ఠానం ఆలోచిస్తుందని, ఎమ్మెల్యేకు చెడ్డపేరు తెచ్చే ఆరోపణలు సోషల్ మీడియాలో పెట్టవద్దన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడుతూ ముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధికి నిధులు తెచ్చానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గణేశ్, లక్ష్మారెడ్డి,చంద్రకాంత్ గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోనేరు పూడ్చివేతకు నిరసనగా నేడు జడ్చర్ల బంద్

- రంగనాయకస్వామి ఆలయ పరిరక్షణ కమిటీ పిలుపు

జడ్చర్లటౌన్, జూలై 7: జడ్చర్ల పట్టణ శివారులోని రంగనాయకస్వామి గుట్టపై కోనేరు పూడ్చివేతకు నిరసనగా సోమవారం జడ్చర్ల బంద్‌కు శ్రీరంగనాయక స్వామి ఆలయ పరిరక్షణ కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీరంగనాయక స్వామి ఆలయ పరిరక్షణ కోసం 25మంది సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పురాతమైన కోనేరును పూడ్చివేసి మనోభావాలను దెబ్బతీశారని, ఇందుకు నిరసనగా జడ్చర్లలో సోమవారం బంద్ చేపట్టాలని నూతన కమిటీ నిర్ణయించింది. ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంద్‌కు పట్టణ ప్రజలందరూ సహకరించాలని సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ట్రస్మా అధ్యక్షుడు అయ్యూబ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి నరేశ్‌కుమార్, కోశాధికారి గోవర్ధన్ జడ్చర్ల బంద్‌కు మద్దతు ప్రకటిస్తూ ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

రీటెండర్ల కోసం నూతన కమిటీ

పాఠశాల షెట్టర్ల రీటెండర్ల కోసం సమావేశమైన గ్రామస్తులు

మహ్మదాబాద్, జూలై 7: మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన షెట్టర్లకు రీటెండర్లు వేయడానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో మహ్మదాబాద్ గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేసి రీటెండర్లు వేయాలని ఏకగ్రీవ తీర్మానం చేసి 15 మంది సభ్యులచే కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాలకు చెందిన షెట్టర్లలో పలురకాల చిరువ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం ఉండగా గత 20 ఏండ్ల నుంచి కొందరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇటీవలే నూతన మండలం ఏర్పడడంతో గ్రామంలో వ్యాపార లావాదేవీలు పెరిగిపోయాయి. దీంతో గ్రామస్తులంతా కలిసి షెట్టర్లను రీటెండర్లు వేస్తే నిరుపేద వ్యాపారులకు కూడా లబ్ధి చేకూరుతుందని, అందుకోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ముందుకెళ్లాలని గ్రామస్తులు పేర్కొన్నారు. సోమవారం రీటెండర్ల తీర్మానాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయునికి అందజేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, చిరువ్యాపారులు, యువకులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి రూ.50వేలు ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

మహ్మదాబాద్, జూలై 7: మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన తిరుమలయ్య (43) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. భార్య గతంలోనే మృతి చెందింది. ప్రస్తుతం తండ్రి కూడా లేకపోవడంతో ముగ్గురు ఆడపిల్లలు ఒంటరి వారయ్యారు. పరిస్థితిని గమనించిన తిరుమలయ్య బాల్య స్నేహితులు (1994-95టెన్త్‌బ్యాచ్) రూ. 50వేలు పోగుచేసి ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతకుముందు వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలానికి చెందిన స్నేహితులు కూడా తిరుమలయ్య కూతుళ్లకు ఆర్థికసాయం అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, అంజిరెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్, వెంకటయ్య, అనిల్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సీసీ రోడ్డు

సీసీ రోడ్డు పక్కన వదిలేసిన ప్రాంతం

ధన్వాడ, జూలై 7: మండలంలోని కొండాపూర్‌లో ఇటీవల వేసిన సీసీరోడ్డు ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా రెండు మూడు అడుగుల దూరంలో డ్రైనేజీ ఉందని, బాటసారులకు, వాహనాలకూ ఇది ఇబ్బందిగా మారిందని తెలిపారు. అధికారులుఉస్పందించి సీసీ రోడ్డు ఎత్తుకు సరిపడేలా ఇరువైపులా మట్టి పోసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తీరనున్న కేజీబీవీ విద్యార్థుల కష్టాలు

కేజీబీవీ పాఠశాల భవనం

మరికల్, జూలై 7: మండలంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించనున్నది. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ప్రైవేటు భవనంలో కొనసాగింది. మూడేళ్లుగా ఆ భవనాన్ని ఖాళీ చేయించడంతో ధన్వాడ కేజీబీవీ పాఠశాలలోనే మరికల్ కేజీబీవీ పాఠశాలను నిర్వహిస్తున్నారు. దీనివల్ల గదుల కొరతతో విద్యార్థులు నిత్యం ఇబ్బందుల మధ్యనే చదువుకుంటున్నారు. మరికల్ కేజీబీవీకి నూతన భవనం మంజూరై ఐదేండ్లు గడిచినా భూ వివాదం వల్ల నిర్మాణం నిలిపివేశారు. ఈ నేపథ్యంలోనే నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.ఆర్‌రెడ్డి పస్పు లలో కేజీబీవీకి స్థలం కేటాయించి రూ.3.35 కోట్లతో భవన నిర్మాణం పూర్తి చే యించారు. ఎట్టికేలకు భవన నిర్మాణం సమస్యల నడుమ పూర్తికావడంతో సోమవారం నారాయణపేట ప్రస్తుత ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, పాలమూరు ఎంపీ డీకే అరుణ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అన్ని సౌకర్యాలు సమకూరితే ఇన్నాళ్లు విద్యార్థులు ఎదుర్కొన్న కష్టాలు తీరినట్లేనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

ప్రతిరోజూ అరగంట నడవాలి

- జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి
- వాక్‌థన్ కార్యక్రమం ప్రారంభం

వాకింగ్‌లో పాల్గొన్న సీఐ, డాక్టర్లు, క్రీడాకారులు, వాకర్స్

జడ్చర్లటౌన్, జూలై 7: సర్వరోగాల నివారిణి వాకింగ్ అని, ప్రతి ఒక్కరూ నిత్యం నడకకు సమయం కేటాయించాలని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి అన్నారు. జడ్చర్లలోని ఏగూర్ ప్రైమ్ దవాఖాన సౌజన్యంతో ప్రజాఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఆదివారం వాక్‌థన్ వాకింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఆదిరెడ్డి వాక్‌థన్ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. స్థానిక ఏగూర్ ప్రైమ్ ఆసుపత్రి నుంచి మూడు కిలోమీటర్ల వరకు వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేశారు.

ఈ సందర్భంగా సీఐ ఆదిరెడ్డి, ఆసుపత్రి ఎండీ అంకిత్ మాట్లాడారు. ప్రతిరోజూ వాకింగ్‌తో పాటు వ్యాయామం చేయాలని సూచించారు. పని ఒత్తిడి, ఆహార అలవాట్లతో చాలామంది చిన్న వయస్సులో అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు వాక్‌థన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ నటరాజ్, బాద్మి రవిశంకర్, రాంరెడ్డి, గోపాల్, కరాటే శ్రీను, సిరాజ్, ఖాదర్, బాద్మి ధ్రువ, వైద్యులు, క్రీడాకారులు, వాకర్స్,తదితరులు పాల్గొన్నారు.

25న పుర చైర్మన్ పదవిపై అవిశ్వాస ప్రక్రియ

జడ్చర్లటౌన్, జూలై 7: జడ్చర్ల మున్సిపల్ చైర్మన్ పదవిపై అవిశ్వాసం పెట్టాలంటూ కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసు మేరకు ఈనెల 25న అవిశ్వాస ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీపై ఆరోపిస్తూ గతనెల 29న కౌన్సిలర్లు సంతకాలు చేసిన కాపీని కలెక్టర్‌కు అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ స్పందించారు. ఇదే విషయంపై మున్సిపల్ కమిషనర్ రాజయ్యను వివరణ కోరగా 25న ఉదయం 11గంటలకు ఆర్డీవో సమక్షంలో అవిశ్వాస ప్రక్రియ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ఎంపీ అభినందన సభకు హాజరవ్వాలి

ధన్వాడ, జూలై 7: మహబుబ్‌నగర్ ఎంపీగా గెలుపొందిన డీకేఅరుణమ్మ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని నారాయణపేట జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి రఘువీర్‌యాదవ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీగా గెలిచిన తర్వాత మొదటిసారి నారాయణపేట వస్తున్నారని జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు గోవర్ధన్‌గౌడ్, రాంచంద్రయ్య, ఉమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఎంపీటీసీలకు సన్మానం

భూత్పూర్, జూలై 7 : మండలంలోని అన్నాసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పదవి విరమణ చేసిన బీఆర్ఎస్ ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను సోమవారం ఉదయం 10.30 సన్మానిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ తెలిపారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకు దీక్షలు

దీక్షను ప్రారంభిస్తున్న బాల్‌రాం

నారాయణపేట, జూలై 7: రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చే దాకా రిలే దీక్షలను కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం అన్నారు. అంగన్‌వాడీలకు మెరుగైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరుతూ పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు రెండో రోజున ఆదివారం కొనసాగాయి. ఈ దీక్షలను సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం ప్రారంభించి మాట్లాడారు. పద్మమ్మ, నర్సింగమ్మ, మౌలానాబీ, తిమ్మమ్మ, బాలమ్మ, తిప్పమ్మ, లక్ష్మమ్మ తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

మురుగుదారి.. పట్టించుకునే వారేరీ?

ఓబులాపూర్‌లో సీసీరోడ్డుపై పారుతున్న మురుగు

మాగనూరు, జూలై 7 : రోడ్డంతా మురుగునీరు.. ఈగలు, దోమలు, దారిపొడవునా దుర్గంధంతో మాగనూరు మండలంలోని ఓబులాపూర్ దర్శనమిస్తోంది. వానకాలం మొదలవడం తో అపరిశుభ్రత మరింత పెరిగి, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ఎవరూ పట్టించుకోకపోవడంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారినపడుతున్నారు. గ్రామంలో డ్రై నేజీలు నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చూసి కూడా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

అడ్డాకులలో ఎంఆర్‌పీఎస్ జెండాను అవిష్కరిస్తున్న నాయకులు

మూసాపేట(అడ్డాకుల), జూలై 7 : మండల కేంద్రంలో ఆదివారం ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఎంఆర్‌పీఎస్ నాయకులు బస్టాండ్‌కు చేరుకొని జెండావిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు శ్రీ కాంత్, సీనియర్ నాయకులు వేవదానం, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో..

బాలానగర్, జూలై 7: మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండాను సమితి బాలానగర్ ఇన్‌చార్జి నరిగె యాదయ్య ఆవిష్కరించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్య ఆధ్వర్యంలో జంగయ్య, యాదయ్య, నేరళ్లపల్లి యాదయ్య, జగ్జీవన్, జగన్ తదితర నాయకులు జెండావిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ జన్మదిన వేడుకలను నిర్వహించారు.

మిడ్జిల్‌లో..

మిడ్జిల్, జూలై 7: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దండోరా జెండావిష్కరణ చేశారు. అనంతరం వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు సురేశ్‌మాదిగ, జిల్లా నాయకులు బాలయ్య, దేవయ్య, బాలు, శ్రీనివాస్ బహదూర్, జంగయ్య, భీంరాజు, రాజేశ్, ప్రశాంత్, రాజు, బంగారు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి.. నలుగురిపై కేసు

మాగనూరు, జూలై 7: పేకాట స్థావరంపై మాగనూరు పోలీసులు శనివారం రాత్రి 12గంటలకు ఆకస్మిక దాడులు నిర్వహించారు. నలుగురిపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ అర్జున్ తెలిపారు. వడ్వాట్ గ్రామంలోని శ్మశాన వాటికలోని ఓ ఖాళీ ప్రదేశంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని తెలియడంతో ఎస్సై నవీద్ సిబ్బందితో పేకాట స్థావరానికి వెళ్లి ముగ్గురు వడ్వాట్ సంబంధించిన వ్యక్తులను, ఒకరు దాసరిదొడ్డి గ్రామానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.42,300 నగదు, నాలుగు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసులు నమోదు చేశారు.

విద్యారంగానికి రమేశ్‌గౌడ్ సేవలు అవసరం

పాలమూరు, జూలై 7: కోడూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంగరమేశ్‌గౌడ్ సేవలు విద్యాశాఖకు చాలా అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ఆయన ఉద్యోగ విరమణ సభకు ముఖ్యఅతిథిగా హాజరై రవీందర్ మాట్లాడారు. క్రమశిక్షణకు అంకితభావానికి మారుపేరుగా నిలిచి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా నిలిచారని, కోడూరు పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు. అదేవిధంగా వారి సలహా లు విద్యాశాఖకు ఎంతో అవసరమన్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ విజయవంతంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు రమేశ్‌గౌడ్ దంపతులను ఘనంగా సన్మానించారు.

జిల్లా సాంఘికశాస్త్ర ఫోరం నూతన కార్యవర్గం ఎన్నిక

పాలమూరు, జూలై 7: మహబూబ్‌నగర్ జిల్లా సమగ్రశిక్ష సమావేశ మందిరంలో ఆదివారం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పదోన్నతులు పొందిన సాంఘిక అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్, కోశాధికారిగా పాండురంగ, ఇతర కార్యవర్గ సభ్యులుగా ఉపాధ్యక్షులుగా ఇబ్రహీం, రవీందర్‌రెడ్డి, శివరాజ్ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం వీరు అందిస్తున్న సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో ఫోరంకు వారి సలహాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫోరం సభ్యులు, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత

ఊట్కూర్, జూలై 7: మండలంలోని పులిమామిడి దళితకాలనీలో నివాసం ఉంటున్న వృద్ధురాలు అమ్మక్క(70) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. విషయం తెలియడంతో ఆమె కుటుంబాన్ని బీఆర్ఎస్ నేత, మాజీ వైస్ ఎంపీపీ ఎల్ల గౌడ్ పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

రఘుబాబు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట టౌన్, జూలై 7: లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ నారాయణపేటటౌన్ 15వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నూతన సభ్యులు అవసరమైన వారికి తగిన సహాయం అందించాలన్నారు. లయన్స్ క్లబ్ వారికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. లయన్ మృత్యుంజయ నూతన కమిటీ అధ్యక్షుడిగా రఘుబాబు, కార్యదర్శిగా మహేశ్‌గౌడ్, కోశాధికారిగా సంజీవరెడ్డిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం లయన్ నటరాజ్ 20మంది మున్సిపల్ సిబ్బందికి బెడ్‌షీట్‌లు, శానిటేషన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, వెంకటేశ్, రాంరెడ్డి, రవికాంత్, మధుసూదన్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులను అభినందిస్తున్న మక్తల్ సీఐ చంద్రశేఖర్

మక్తల్, జూలై 7: విద్యార్థు లు చదువుతో పాటు క్రీడల్లో నూరాణించాలని మక్తల్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మక్తల్ సర్కిల్ కార్యాలయంలో జాతీయ స్థాయి టగ్‌ఆఫ్‌వార్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న నవిత, కవిత, శ్రావణి, శివమ్మ, మౌనిక, స్రవంతి, సాయిలు, అనుష, లలితను సీఐతో పాటు టగ్‌ఆఫ్‌వార్ అధ్యక్షుడు హరిప్రసాద్ గుప్త అభినందించారు. కార్యక్రమంలో నవీద్, బ్రహ్మానందం, వెంకటేశ్, తాన్‌సింగ్, గోపాలం, అమ్రేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాజనర్సింహకు నిరుద్యోగుల వినతి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

పాలమూరు, జూలై 7: మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఉమ్మడి జిల్లా నిరుద్యోగులు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్దకు చేరుకొని వినతిపత్రం అందజేశారు. డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని కోరారు. అభ్యర్థులు చదువుకోడానికి సమయం సరిపోదనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయంలో డీఎస్సీకి అభ్యర్థులు అభ్యర్థులు పాల్గొన్నారు.

బోనాలపండుగను ప్రశాంతంగా నిర్వహించాలి

సమావేశం నిర్వహిస్తున్న గ్రామస్తులు

దేవరకద్ర, జూలై 7 : ప్రతిఏడాది నిర్వహించే పోచమ్మ బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రామస్తులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థాన ప్రాంగణంలో గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు, వివిధ కులసంఘాల నాయకులతో పాటు పురోహితులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోచమ్మ బోనాల ఉత్సవాలపై చర్చించారు. ఈ నెల 23న పోచమ్మ బోనాల ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. సమావేశంలో శ్రీకాంత్ యాదవ్, కుర్వరాంపాడు, కుర్వ రాందాస్, వర్మ, అశోక్ గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, కుర్మన్న, దేవన్న సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వనమహోత్సవం

భూత్పూర్, జూలై 7 : మండలంలోని తాటిపర్తిలో సోమవారం ఉదయం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రభాకరచారి తెలిపారు. తాటిపర్తి, కొత్తమొల్గర గ్రామాల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

జెడ్పీ తాజామాజీ వైస్ చైర్మన్‌కు సన్మానం

యాదయ్యను సన్మానించిన కులసంఘాల నాయకులు

జడ్చర్లటౌన్, జూలై 7: జెడ్పీ తాజా మాజీ వైస్‌చైర్మన్ యాదయ్య జెడ్పీటీసీగా ఐదేండ్లు పదవీ బాధ్యతలు పూర్తి చేసిన సందర్భంగా ఆదివారం జడ్చర్లలో కుల సంఘాల ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా కుల సంఘాల నాయకులు మాట్లాడారు. యాదయ్య ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించారన్నారు. కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు కొంగళి మోహన్ రాజ్, నాగరాజు, కరాటే శ్రీను, జంగయ్య, దగ్గుల బాల్‌రాజ్, శ్రీకాంత్, ఊషన్న, వెంకటయ్య, కృష్ణ, పాల్గొన్నారు.

వర్షానికి కూలిన మిద్దె

కురిసన వర్షాలకు కూలిన మిద్దె

ధన్వాడ, జూలై 7: మండలంలోని గోటూర్‌లో రెండ్రోజులు కురుస్తున్న వర్షానికి పాత మట్టిమిద్దె కూలింది. ఆ వివరాలు.. గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి, రమాదేవి శనివారం రాత్రి పీర్ల ప్రతిష్టాపన కార్యక్రమం చూడడానికి వెళ్లారు. ఇదే సమయంలో మిద్దె కూలింది. ప్రాణాపాయం తప్పడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎరుకల సంక్షేమానికి సహకారం అందించాలి

ఎమ్మెల్యేకు ఆహ్వానప్రతం అందజేస్తున్న కృష్ణయ్య

మూసాపేట(అడ్డాకుల), జూలై 7 : ఎరుకల సంక్షేమానికి ప్రభుత్వం సహకారం అందించాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య కోరారు. మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన కృష్ణయ్య సంఘం సభ్యులతో పాటు కలిసి హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జీఎంఆర్‌ను కలిశారు. ఈ నెల 17వ తేదీన జిల్లా కేంద్రంలోని నిర్వహించే ఏకలవ్యుడి జయంతి వేడుకలకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాములు, ఉపాధ్యక్షుడు బండి రవికుమార్, కోశాధికారి నల్లగొండ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.